

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 61 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 31, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అమ్మా.. నువ్వెక్కడా !





● నగరంలో ఆగని చైల్డ్ ట్రాఫికింగ్ ● సంతాన లేమితో బాధ పడుతున్నవారే టార్గెట్ ● పిల్లలని దోచేసి అమ్మేస్తున్న వైనం ● అద్దె గర్భం కోసం చెత్త ఏరుకునే మహిళలే లక్ష్యం ● పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర చిన్నారుల అక్రమ రవాణా ముఠా ● గుజరాత్ నుంచి చిన్నారులను తెచ్చి హైదరాబాద్, జిల్లాలలో అమ్ముతున్నారు.. ● 11 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు ● చైల్డ్ ట్రాఫికింగ్ చెర లో వేల మంది ● డాక్టర్ బరిగెల శివ



**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

కన్నతల్లి ఒడిలో కేరింతలు కొట్టాల్సిన చిన్నారులు, అంగట్లో సరకుల్లా మారుతున్నారు. నెలలు నిండని వయసులో అక్రమ రవాణా ముఠా చేతులకు చిక్కి రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నారు. హైదరాబాద్ మహానగరంలో మరోసారి చిన్నారుల అక్రమ రవాణా, విక్రయిస్తున్న ముఠా పట్టుబడింది. మియాపూర్ క్రాస్‌రోడ్ వద్ద నిందితులను శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వెంకిపల్లి గంగాధర్‌రెడ్డి కొన్నేళ్ల క్రితమే సికింద్రాబాద్‌కు వచ్చాడు. అతడిపై చిన్నారుల విక్రయాలకు సంబంధించి 5 కేసులున్నాయి. కొన్ని ఫెర్టిలిటీ కేంద్రాల్లో పని చేస్తూ డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం ప్రారంభించాడు. సంతానలేమితో బాధపడే దంపతులు ఐవీఎఫ్, సరోగసీ కోసం ఫెర్టిలిటీ కేంద్రాలకు వచ్చినప్పుడు వారితో మాట కలుపుతాడు. తెలిసిన వారికి నెలల వయసున్న పిల్లలున్నారని, డబ్బులిస్తే అప్పగిస్తానని చెబుతాడు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలకు వెళ్లి నిరుపేద తల్లిదండ్రులకు డబ్బు ఆశచూపి వారి పిల్లల్ని తీసుకొచ్చేవాడు. 2014లో తొలిసారి పిల్లల్ని విక్రయిస్తూ పోలీసులకు చిక్కాడు. 2018లో చిన్నారులను విక్రయిస్తూ మరోసారి ఆర్‌జీఏఐ, బాలాపూర్ పోలీసులకు చిక్కాడు. అప్పటికే అతడు 12 మంది పిల్లలను విక్రయించాడు. 2020లో మూడోసారి జైలుకెళ్లొచ్చినా తీరు మారలేదు. ఈ ఏడాది ఆగస్టులో సృష్టి ఫెర్టిలిటీ కేసులో అరెస్టైన మూసాపేటకు చెందిన మహిళ కుమ్మరి హర్షరాయ్ (31) ఇటీవలే జైలు నుంచి విడుదలైంది. ఆమెతో కలిసి గంగాధర్‌రెడ్డి మళ్లీ చీకటి దందా మొదలెట్టాడు.

**ఆ నిందితులే ఇందులోనూ సూత్రధారులు..**

పాత మిత్రుడు ఏపీలోని కడప జిల్లాకు చెందిన దమ్మాయిగూడలో నివాసముండే వేముల బాబురెడ్డితో కలిసి ప్రస్తుతం దందా కొనసాగిస్తున్నాడు. వీరిద్దరూ గతంలో ఆసుపత్రులు,ఫెర్టిలిటీ కేంద్రాలకు బ్రోకర్లుగా పని చేసేవారు. నగరానికి ఉపాధి కోసం వచ్చే నిరుపేదల పిల్లల్ని కిడ్నాప్ చేసి అమ్మేవారు. 2020లో అల్వాల్ పోలీసులకు దొరికగా కేసు నమోదైంది. బాబురెడ్డి మీద దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లోనూ ఓ కేసు నమోదైంది. తాజాగా మరోసారి చేతులు కలిపారు. వీరు కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన దారం లక్ష్మి, బిహార్‌లోని శివాన్ జిల్లాకు చెందిన జీడిమెట్లలో నివాసముండే రామ్‌హరిరాయ్, జగద్గిరిగుట్టకు చెందిన సంగీత దేవి,కర్నూలు జిల్లాకు చెందిన నారపల్లిలో నివాసముండే సుజాత, సికింద్రాబాద్‌లో నివాసముండే సిద్దిపేట జిల్లాకు చెందిన అనురాధ, బేగంపేటకు చెందిన ఈసారపు జ్యోతి, చింతల్‌కు

- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి.. తొలి సీఎంగా చరిత్ర

**హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్**

**సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు**

**శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్**

రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




2

## కేసీఆర్‌కు సిట్ మరోసారి నోటీసులు...

## ఫామ్‌హౌస్‌లో విచారణ జరపాలన్న విజ్ఞప్తి తిరస్కరణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు రెండోసారి సిట్ నోటీసు

ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశం

నందినగర్ నివాసంలోనే విచారిస్తామని స్పష్టం చేసిన సిట్

2



## మేడారం జాతర: గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క.. జనసంద్రంగా మారిన వనం

2

**ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్**

ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కొనసాగుతున్న భేటీ

మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై కొనసాగుతున్న చర్చ

నిన్న కేసీఆర్ తో భేటీ అయిన హరీశ్ రావు

2





## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బెంగాల్‌లో గెలిచేదెవరు?

బెంగాల్‌లో 'దీదీ' హవా.. పుంజుకుంటున్న బీజేపీ

నేడు లోక్‌సభ ఎన్నికలు జరిగినా టీఎంసీ తన పట్టును నిలబెట్టుకుంటుందన్న సర్వే

గత ఆగస్టు సర్వేతో పోలిస్తే బీజేపీ తన స్థానాలను 11 నుంచి 14కి పెంచుకునే అవకాశం

రాష్ట్రంలో సున్నాకి పడిపోనున్న కాంగ్రెస్ ప్రాతినిధ్యం

'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో ఆసక్తికర అంశాలు

2

# అమ్మా నువ్వెక్కడా...

చెందిన మాధవి, ముషీరాబాద్‌కు చెందిన పోతుల శోభ తదితరుల్ని సహాయకులుగా పెట్టుకున్నారు.

మొదటి పేజీ తరువాయి

**11 మంది నిందితులు అదుపులో..**

గంగాధర్ తన సహాయకులు లక్ష్మీ,సంగీత,హర్షరాయ్, హరిరాయ్ ద్వారా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన దంపతుల నుంచి నెలల వయసున్న చిన్నారిని ఇటీవల కొన్నారు. బాబురెడ్డి ఒక చిన్నారి కావాలంటూ గంగాధర్‌రెడ్డిని సంప్రదించాడు. అతడు అనుచరుల ద్వారా సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతుల నుంచి చిన్నారిని కొని తీసుకొచ్చారు. ఇద్దరు చిన్నారుల్ని హైదరాబాద్‌లోనే ఉండే సంతానం లేని తల్లిదండ్రులకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు మియాపూర్‌లో 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు చిన్నారుల్ని రక్షించి అమీర్‌పేట శిశువిహార్‌కు అప్పగించారు. చిన్నారులకు సంబంధించిన రక్త సంబంధీకులు ఎవరైనా వస్తే వారిని అప్పగిస్తామని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు.ఎవరూ రాకపోతే పిల్లల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆ చిన్నారులను దత్తతగా ఇస్తామని చెప్పారు.

**విచారణలో విస్తుపోయే నిజాలు..**

పోలీసులు నిందితుల్ని విచారించగా విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. 9 ఫెర్టిలిటీ కేంద్రాలకు గంగాధర్‌రెడ్డి, బాబురెడ్డి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. సరోగసీ కోసం ఫెర్టిలిటీ కేంద్రాలకు వచ్చే దంపతుల కోసం అద్దె గర్భం ఇచ్చేందుకు మహిళల్ని సమకూర్చేవారు. ఇందుకోసం నగరంలో ఫుట్‌పాత్‌ల దగ్గర ఉంటూ చెత్త ఏరుకునే మహిళల్ని సంప్రదించేవారని తెలుస్తోంది. వారికి డబ్బు ముట్టజెప్పి సరోగసీలో భాగంగా గర్భం దాల్చేందుకు ఒప్పించేవారు. ఒక్కో సరోగసీ కోసం రూ.30 లక్షల వరకూ తీసుకునేవారు. వచ్చిన డబ్బులో ఫెర్టిలిటీ కేంద్రాలు, గర్భం దాల్చిన మహిళలకు ఇచ్చి మిగిలింది తీసుకునేవారు. ఫెర్టిలిటీ కేంద్రాలకు అండాలు విక్రయించేందుకు కొందరు నిరుపేద మహిళల్ని ఒప్పించేవారు.నిందితులు అక్రమంగా చేస్తున్న అక్రమ సరోగసీ మీద పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి.. తొలి సీఎంగా చరిత్ర

మొదటి పేజీ తరువాయి

జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు -24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.


## ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ లో వీరి భేటీ కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ తో నిన్న హరీశ్ రావు భేటీ అయిన సంగతి తెలిసిందే. సిట్ అడిగే ప్రశ్నలు, సమాధాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది. కేసీఆర్ కు అందిన నోటీసులను ఎలా ఎదుర్కోవాలి, ఈ విషయాన్ని పార్టీకి నష్టం కలగకుండా ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై నిన్న హరీశ్ తో, ఈరోజు కేటీఆర్ తో చర్చిస్తున్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో రాజకీయ పరంగా ఎలాంటి అడుగులు వేయాలి, ఎలాంటి ప్రజా ఉద్యమాలను నిర్మించాలి, మీడియా ముందుకు ఎలాంటి అంశాలను తీసుకెళ్లాలనే అంశాలపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ దూకుడు తగ్గించాలనే పట్టుదలతో ఉంది.

## రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదు: హరీశ్ రావు

**తెలంగాణ జలాలను ఏపీకి దోచిపెడుతున్నారని హరీశ్ మండిపాటు**
**కత్తి చంద్రబాబుది, పొడిచేది రేవంత్ రెడ్డి అని విమర్శ**
**చంద్రబాబుకి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని మండిపాటు**

తెలంగాణ జలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రకు దోచిపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఈ ప్రాంతంవాడే తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని కాళోజీ ముందే చెప్పినట్టే... సీఎం హోదాలో రేవంత్ రెడ్డి తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెడుతున్నారని అన్నారు. పక్కా పథకం ప్రకారం పోలవరం-నల్లమలసాగర్ కు ఏపీ ప్రభుత్వానికి రేవంత్ సర్కార్ సహకరిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి, వాపస్ తెచ్చుకున్నారని విమర్శించారు. తొలి నుంచి కూడా గోదావరి నదీ జలాల అక్రమ తరలింపుపై బీఆర్ఎస్ అప్రమత్తం చేస్తూనే ఉందని... అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ అన్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నా... కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పులు చేస్తూనే ఉందని దుయ్యబట్టారు. జలద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదని, పొడిచేది రేవంత్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదని హరీశ్ అన్నారు. రేవంత్ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, రాష్ట్ర నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తామని ప్రకటించారు. తెలంగాణకు జరుగుతున్న దోపిడీపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా నోరు విప్పాలని డిమాండ్ చేశారు.



# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బెంగాల్‌లో గెలిచేదెవరు?

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉన్న తరుణంలో.. రాష్ట్ర ఓటర్ల నాడిని 'ఇండియా టుడే - సి ఓటర్' సర్వే ఆవిష్కరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరిగితే బెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ తిరుగులేని శక్తిగా నిలుస్తుందని ఈ సర్వే స్పష్టం చేసింది. 2024 ఎన్నికల ఫలితాలను (29 సీట్లు) దాదాపుగా పునరావృతం చేస్తూ.. ఈసారి టీఎంసీ 28 స్థానాలను కైవసం చేసుకుంటుందని అంచనా వేసింది.గత ఏడాది ఆగస్టులో జరిగిన సర్వేలో బీజేపీకి కేవలం 11 సీట్లు వస్తాయని అంచనా వేయగా.. తాజా జనవరి 2026 సర్వేలో ఆ సంఖ్య 14కు పెరిగింది. ఎన్డీయే ఓటు షేర్ కూడా 39 శాతం నుంచి 42 శాతానికి పెరగడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 12 స్థానాలకే పరిమితమైన సంగతి తెలిసిందే. అంటే క్రమంగా కమలం పార్టీ తన బలాన్ని పెంచుకుంటోంది.మరోవైపు ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈ సర్వే నిరాశే మిగిల్చింది. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఏకైక సీటును కూడా కోల్పోయే అవకాశం ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఖాతా తెరవడం కష్టమేనని సర్వే పేర్కొంది. సి-ఓటర్ వ్యవస్థాపక డైరెక్టర్ యశ్వంత్ దేశ్‌ముఖ్ అభిప్రాయం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాజకీయాలు తీవ్రంగా పోలరైజేషన్ అయ్యాయి. ఓటర్లు స్పష్టంగా అధికార టీఎంసీ లేదా ప్రతిపక్ష బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు విడుదలైన ఈ గణాంకాలు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతుండగా.. టీఎంసీ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడంలో సఫలీకృతమవుతోం దని విశ్లేషకులు భావిస్తున్నారు.జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ ప్రభావం బలంగా ఉండటంతో ఎన్డీయే కూటమికి 352 స్థానాలు లభిస్తాయని ఈ సర్వే అంచనా వేసింది. బెంగాల్‌లో టీఎంసీ సీట్లు ఆగస్టు అంచనా (31) కంటే ఇప్పుడు కొద్దిగా తగ్గినప్పటికీ, ఓవరాల్‌గా మమతా బెనర్జీ ఇమేజ్ చెక్కుచెదరకుండా ఉందని సర్వే ఫలితాలు సూచిస్తున్నాయి.

# కేసీఆర్‌కు సిట్ మరోసారి నోటీసులు... ఫామ్‌హౌస్‌లో విచారణ జరపాలన్న విజ్ఞప్తి తిరస్కరణ

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని 160 సీఆర్‌పీసీ కింద ఈ నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా, హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలోనే విచారణ జరపనున్నట్లు సిట్ స్పష్టం చేసింది.ఇటీవల గురువారం సిట్ తొలిసారి నోటీసులు జారీ చేయగా, మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఖరారు అంశంలో బిజీగా ఉన్నందున మరో తేదీ కేటాయించాలని కేసీఆర్ కోరారు. ఇందుకు సిట్ అంగీకరించింది. అయితే, తనను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లోనే విచారించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని మాత్రం సిట్ అధికారులు తిరస్కరించారు. న్యాయ నిపుణుల సలహా మేరకు, నందినగర్‌లోని అధికారిక నివాసంలోనే విచారణ జరపాలని నిర్ణయించి, శుక్రవారం రెండోసారి నోటీసులు అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పాటు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావులను సిట్ విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసింది. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా ఈ కేసులో కేసీఆర్‌ను విచారించడం కీలకమని సిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న విచారణ తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# మేడారం జాతర: గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క.. జనసంద్రంగా మారిన వనం





**వైభవంగా సమ్మక్క గద్దె చేరే ఘట్టం.. పోటెత్తిన భక్తజనం**
**వివిధ రాష్ట్రాల నుంచి పోటెత్తిన లక్షలాది భక్తులు**
**వనదేవతలకు మొక్కులు చెల్లించిన బ్రిటిష్ అధికారి**
**పటిష్ట ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా సాగుతున్న జాతర**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర మూడో రోజైన శుక్రవారం పతాకస్థాయికి చేరింది. వనదేవత సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరడంతో మేడారం ప్రాంగణం భక్తులతో జనసంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మేడారం కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలు, జంపన్న వాగు భక్తులతో నిండిపోయాయి. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. జాతర ప్రశాంతంగా సాగుతోందని అధికారులు తెలిపారు. ఈ జాతరకు ప్రముఖుల తాకిడి కూడా కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ శుక్రవారం మేడారం సందర్శించి, సంప్రదాయ వస్త్రధారణలో తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆయనకు జాతర ప్రాశస్త్యాన్ని వివరించారు. వీరితో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు కొండా సురేఖ, భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం గురువారం రాత్రి జరిగింది. చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని గిరిజన సంప్రదాయాల నడుమ మేడారంలోని గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్క తల్లి ప్రయాణం ప్రారంభమవగానే, జిల్లా ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అర్ధరాత్రి దాటాక సమ్మక్క తల్లి గద్దెపైకి చేరారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరగా, సమ్మక్క తల్లి కూడా చేరడంతో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

# పీటీ ఉష భర్త కన్నుమూత

**నిన్న అర్ధరాత్రి కన్నుమూసిన ఉష భర్త శ్రీనివాసన్**
**కబడ్డీ క్రీడాకారుడిగా పేరుగాంచిన శ్రీనివాసన్**
**1991లో పెళ్లి చేసుకున్న ఉష, శ్రీనివాసన్**

భారతదేశం గర్వించదగ్గ క్రీడాకారిణి, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పీటీ ఉష ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త వెంగళిల్ శ్రీనివాసన్ కన్నుమూశారు. ఆయన వయసు 67 సంవత్సరాలు. నిన్న అర్ధరాత్రి ఆయన కోజికోడ్ జిల్లాలోని తిక్కోడి పెరుమల్పురంలో ఉన్న నివాసంలో అర్ధరాత్రి 1 గంట సమయంలో ఒక్కసారిగా కుప్పకూలారు. కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆయన అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ప్రకటించారు. భర్త మరణించిన సమయంలో పీటీ ఉష ఇంట్లో లేరు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో ఆమె ఢిల్లీలో ఉన్నారు. తన భర్త మరణవార్త తెలియగానే ఆమె వెంటనే ఢిల్లీ నుంచి బయల్దేరి కేరళకు చేరుకున్నారు. శ్రీనివాసన్ విషయానికి వస్తే... ఆయన కబడ్డీ ఆటగాడు. సీఐఎస్ఎఫ్ లో డిప్యూటీ ఎస్పీగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. పీటీ ఉషకు ఆయన దూరపు బంధువు అవుతారు. 1991లో వీరు వివాహం చేసుకున్నారు. వీరికి ఉజ్వల్ విఘ్నేష్ అనే కుమారుడు ఉన్నాడు. శ్రీనివాసన్ మృతి వార్తతో భారత క్రీడా ప్రపంచంలో విషాదం నెలకొంది. పీటీ ఉషకు క్రీడ, రాజకీయ ప్రముఖుల నుంచి సంతాపాలు వెల్లువెత్తుతున్నాయి.



# మున్సిపల్ ఎన్నికల వేళ సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా. - జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్.

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు లేదా అసత్య ప్రచారాలు చేస్తే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మరియు సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు లేదా పోస్టులను ప్రోత్సహించవద్దని సూచించారు. ఏ సమాచారాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా




సహకరించాలని ఎస్పీ తెలిపినారు.

# నకిలీ పత్రాలు సృష్టించి దళితుల భూమిని ఆక్రమించే ప్రయత్నం

**బెంగళూరు జై భీమ్ న్యూస్ : :**

భూ దొంగలు మరియు అగ్రవర్ణానికి చెందినవారు షెడ్యూల్డ్ తెగ వాల్మీకి వర్గానికి చెందిన 1 ఎకరం 38 గుంటల భూమిని నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించడానికి ప్రయత్నించారు. భీమ్ సేవా సమితి పోరాటం ఫలితంగా, షెడ్యూల్డ్ తెగల చేతుల నుండి తప్పిపోయిన భూమిని చట్టం ద్వారా అసలు భూ యజమానులకు తిరిగి ఇచ్చామని భీమ్ సేవా సమితి వ్యవస్థాపకుడు మరియు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ రావణ్ అన్నారు. రాజన్న తండ్రి బైటప్ప, సోమన్న తండ్రి బైటప్ప అగ్రవర్ణానికి చెందిన వారికి బకాయి ఉన్న రుణాన్ని చెల్లించలేదు మరియు కోలార్ తాలూకాలోని నరసాపుర హోబ్లిలోని మల్లాసంద్ర గ్రామంలోని సర్వే నంబర్ 35లోని షెడ్యూల్డ్ తెగలకు చెందిన భూమిని మోసం మరియు నకిలీ పత్రాలు సృష్టించడం ద్వారా దొంగిలించారు. వారు సంబంధిత విభాగానికి "భూ కబ్జా దొంగలపై" ఫిర్యాదు చేసి, పత్రాలను రద్దు చేశారు. భూమి యజమాని అయిన మునిషమన్న బిన్ మునియప్పతో పాటు బాధిత కుటుంబ సభ్యులకు భూమి పత్రాలతో పాటు భూమిని కూడా అందించామని, భూమి దొంగల నుండి భూమిని విడిపించి, ఆ భూమిలో వ్యవసాయం ప్రారంభించడానికి బాధిత కుటుంబానికి అప్పగించామని శ్రీకాంత్ రావణ్ తెలిపారు. భీమ్ సేవా సమితి (రి) రాజ్య అధ్యక్షుడు, సందర్భంలో యూత్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ బిసి, మునిరాజ్ బి. ఆర్, శ్రీనాథ్ సి, వరుణ్ రాజ్ చక్రవర్తి, సయ్యద్, కిరణ్,



పృథ్వీ, సూర్య (సూరి) రవితేజ్, తరుణ్, వినయ్ కుమార్, నాగేష్, రవి భువనహళ్లి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారిపేట జాతరలో పోలీసుల అప్రమత్తత పోయిన రూ.15 వేల ఫోన్‌ను యజమానికి అందజేసిన మానవీయత

**మడికొండ, 30 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

అమ్మవారిపేట జాతర సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో, శ్రీనివాస టఫ్ గ్లాస్ షాప్ ఎదుట కరీంనగర్‌కు చెందిన ఐస్‌క్రీమ్ వ్యాపారి షేక్ ఫిరోజ్ తనకు చెందిన సుమారు రూ.15,000 విలువైన మొబైల్ ఫోన్‌ను పొరపాటున కోల్పోయాడు. వేలాది మంది భక్తులతో జాతర ప్రాంగణం కిక్కిరిసి ఉండటంతో, ఫోన్ తిరిగి దొరుకుతుందా అనే ఆందోళన అతనిని వెంటాడింది. ఈ విషయం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరగానే, వెంటనే మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ఫోన్ వివరాలు జాతర ప్రాంగణం అంతటా తెలియజేశారు. ఈ ప్రకటనకు స్పందించిన ఒక వ్యక్తి దొరికిన ఫోన్‌ను క్యూ.ఆర్.టి పోలీస్ కానిస్టేబుల్ బి. దేవప్రసాద్కు అప్పగించాడు. అనంతరం ఆ ఫోన్‌ను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. తదుపరి మడికొండ ఇన్‌స్పెక్టర్ పి. కిషన్ సమక్షంలో అవసరమైన అన్ని వివరాలను ధృవీకరించిన అనంతరం, ఆ ఫోన్‌ను యజమాని షేక్ ఫిరోజ్‌కు అధికారికంగా అప్పగించారు. తన విలువైన ఫోన్ తిరిగి లభించడంతో ఫిరోజ్ ఆనందంతో మురిసిపోయాడు. ఈ సందర్భంగా అతను మరియు అతని కుటుంబ సభ్యులు పోలీస్ శాఖకు, ముఖ్యంగా కంట్రోల్ రూమ్ సిబ్బందికి, ఇన్‌స్పెక్టర్ కిషన్ కి,




కానిస్టేబుల్ దేవప్రసాద్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల రద్దీతో కూడిన మహాజాతరలో కూడా, పోలీసుల అప్రమత్తత, నిజాయితీ, ప్రజల పట్ల బాధ్యత ఈ సంఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇది పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచే మానవీయ ఉదాహరణగా నిలిచింది.

# పురపాలక ఎన్నికలు పారదర్శకంగా జరగాలి రాజకీయ పార్టీలు సహకరించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 30 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**


వరంగల్ జిల్లాలో జరగనున్న నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధి విధానాలు, ఖర్చుల నియంత్రణ, ప్రచార నిబంధనల అమలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చుల నియంత్రణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి రేట్ చార్ట్‌ను ఖరారు చేశారు. ప్రతి అభ్యర్థి లక్ష రూపాయల కంటే ఎక్కువగా ఖర్చు చేయరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. చేసిన ప్రతి ఖర్చును రికార్డుల రూపంలో నమోదు చేసి, సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాల్సిందేనని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి పార్టీ కచ్చితంగా పాటించాలనీ, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఎన్నికల ప్రక్రియను స్వచ్ఛంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎన్నికల నిర్వహణలో సమానత్వం, పారదర్శకత, న్యాయసమ్మతత ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీవో కల్పనతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీఎస్పీ పార్టీ తరపున హరిశంకర్, అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ తరఫున రజినీకాంత్, ఏఐఎంఐఎం తరపున సయ్యద్ ఫైజుల్లా తదితరులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.




# వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో పొదల్లో నెలలు నిండని పసికందు

### స్థానికంగా తీవ్ర కలకలం రేపిన పసికందు

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**



వికారాబాద్ జిల్లాలోని స్థానిక బస్ స్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు పసికందును పొదల్లో పడేసి వెళ్లినట్టు స్థానికులు గుర్తించారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పసికందును సమీప ఆసుపత్రికి తరలించారు. పసికందు మృతి చెందినట్లు సమచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పసికందును వదిలి వెళ్లిన వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పిల్లలు పుట్టక దేశంలో అనేక మంది గుళ్ళు గోపురాలు ఆసుపత్రుల చుట్టూ తిరుతురిగుతూ, నా కడుపులో కూడా ఒక ప్రాణం పురుడు పోసుకోబోదా అని వేయి కన్నులతో కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. పాపను చేతులతో పట్టుకొని తన బుగ్గలు గిల్లుతూ.. తన నవ్వుతో నేను చేసే రోజంతా కష్టాన్ని కనురెప్ప మూసితెరిచేలోపల ఆ కష్టాన్ని మరిచిపోలేమా, నా బాల్యంలో నేను వదులుకున్న అనుభవాలు తనలో నూరిబోసి నేను ఆనంద పడబోనా అని అలసిపోయిన ప్రాణాలు ఎన్నో ఉన్నాయి ఈ భూమీద. అలాంటి ఈరోజుల్లో అదృష్టాన్ని కాలతన్ని కడుపులో పుట్టిన కన్నా బిడ్డను రోడ్డు పక్కల పడేసి చంపిన వారు తల్లిదండ్రులే ఐతే ఆ తల్లికి, ఆ తండ్రికి మనసెల వచ్చింది, ఆ కన్న తల్లికి పురిటినొప్పులు నొయ్యలేదా.. కడుపులో మోయలేదా అని కన్నీరు పెట్టుకున్నాడు వికారాబాద్ జిల్లా రిపోర్టర్ ఆదిత్య శ్రీనివాస్. పోలీసులు ఆ బాధితులను వెతికి పట్టుకొని కటినంగా శిక్షించాలని కోరారు

# మహిళా కానిస్టేబుల్ రామావత్ అనితకు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు నివాళులు



**హన్మకొండ, 30 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ, వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన మహిళా కానిస్టేబుల్ రామావత్ అనిత ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమె నివాసానికి వెళ్లిన గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు అనిత భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు గారు, ఈ దుర్ఘటన పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఎదురయ్యే ఒత్తిళ్లను ప్రభుత్వం గమనించి, మహిళా సిబ్బంది సంక్షేమానికి మరింత బలమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, స్థానిక సర్పంచ్ నరేష్, మాజీ సర్పంచ్ హేమ్లా నాయక్, సర్పంచులు చిటూరి శంకర్, గాడిపెల్లి మహేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని ఆమెకు చివరి నివాళులు అర్పించారు. రామావత్ అనిత మృతి పోలీస్ శాఖలోనే కాకుండా సమాజమంతటినీ కలిచివేసిన ఘటనగా నిలిచింది. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ, బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని, తగిన సహాయం అందాలని పలువురు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన నకరకంటి మోహన్ గౌడ్

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని అశోక హోటల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ ను వరంగల్ జిల్లా కాంగ్రెస్ సేవా దళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ మోహన్ గౌడ్ కు వరంగల్ జిల్లా భవిష్యత్తు కార్యక్రమాలపై ముఖ్య సలహాలు, సూచనలు చేశారు. పార్టీ బలోపేతం కేడర్ కు ఉత్సాహం, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సాగాల్సిన పార్టీ చైతన్య కార్యక్రమాలపై కార్యక్రమాలపై చర్చించినట్లు మోహన్ గౌడ్ తెలిపారు. అయనతో పాటు సదానందం తదితరులు ఉన్నారు..



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# మాజీ మంత్రి, అరవింద్ లింబావలి జన్మదినోత్సవం సందర్భంగా కబడ్డీ పోటీలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే మంజుల లింబావలి



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక మాజీ మంత్రి, మహదేవపుర టాస్క్ ఫోర్స్ అధ్యక్షుడు అరవింద్ లింబావలి 59వ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం హూడి స్పోర్ట్స్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి పురుషులు మరియు మహిళల కబడ్డీ టోర్నమెంట్‌ను మహదేవపుర నియోజకవర్గ ఎమ్మెల్యే మంజుల అరవింద్ లింబావలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం మరియు జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. కబడ్డీ మన దేశ వారసత్వ క్రీడ అని, గ్రామీణ ప్రాంతాల నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతుండటం గర్వకారణమని ఆమె అన్నారు. మహిళల విభాగంలో బెంగళూరు నగరం, దక్షిణ కన్నడ, హావేరి, శివమొగ్గ, చిక్కమగళూరు, బెంగళూరు దక్షిణ, బెల్గాం మరియు మైసూర్ జిల్లాల జట్లు ఈ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. పురుషుల విభాగంలో, బెంగళూరు నగరం, దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, శివమొగ్గ, బెల్గాం, కోలార్, ధార్వాడ్ మరియు దావణగెరె జిల్లాల జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు జరుగుతుంది మరియు చివరి రోజు ఆదివారం విజేతలకు మాజీ మంత్రి బహుమతులు ప్రదానం చేస్తారని కార్యక్రమ నిర్వాహకుడు హూడి పిల్లప్ప తెలిపారు. మొదటి బహుమతిగా ట్రోఫీతో పాటు ₹75,000 నగదు బహుమతి, రెండవ బహుమతిగా ట్రోఫీతో పాటు ₹50,000 నగదు బహుమతి, మూడవ బహుమతిగా ట్రోఫీతో పాటు ₹25,000 నగదు బహుమతి అందజేస్తారు. స్థానిక క్రీడాభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అలాంటివారు ఈ పండు తినకండి!



జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.

# పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?

వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.

# భద్రకాళీ అమ్మవారి సన్నిధిలో తొగుట పీఠాధీశ్వరులు శ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారి దర్శనం





**వరంగల్, 30 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళీ దేవస్థానాన్ని ఈ రోజు ఉదయం తొగుట పీఠాధీశ్వరులు మాధవానంద సరస్వతీ స్వామి వారు భక్తిశ్రద్ధలతో దర్శించారు. స్వామివారు ఆలయానికి విచ్చేయగా ఆలయ ధర్మకర్తలు గాదె శ్రవణ్‌కుమార్ రెడ్డి, మయూరి రామేశ్వరరావు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్‌లు, ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత, శ్రీభద్రకాళి శేషు పూర్ణకుంభం, మంగళవాద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారు శ్రీ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ స్నపన మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ, ధర్మం, భక్తి, సేవల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ నిర్వహించారు. శుక్రవారం శుక్రవారం కావడం, అలాగే పుట్టంరెడ్డి దీప్తిరెడ్డి అమ్మవారికి బహుకరించిన సర్వాంగ వెండి కవచం, మంగళ్యాలతో అమ్మవారిని అభిషేకం అనంతరం విశేషంగా అలంకరించడంతో భద్రకాళీ అమ్మవారి దివ్యరూపం అత్యంత భక్తిపూర్వకంగా దర్శనమిచ్చింది. ఆ అలంకారంలో అమ్మవారిని దర్శించిన భక్తులు “ఈ దివ్యరూపాన్ని దర్శించడానికి రెండు కళ్ళు సరిపోవట్లేదు” అంటూ ఆనందోత్సాహాలతో స్పందించారు. అనంతరం దేవాలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, మయూరి రామేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి రామల సునీత దాత పుట్టంరెడ్డి దీప్తిరెడ్డిని దేవస్థానం తరపున శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు. భక్తుల సందర్శనతో, విశేష అలంకారాలతో శుక్రవారం భద్రకాళీ దేవస్థానం ఆధ్యాత్మిక వాతావరణంతో ఉట్టిపడింది.

# అమ్మవారి సన్నిధిలో అపూర్వ మానవత్వం

### వృద్ధురాలికి తల్లి స్థానం తీసుకున్న మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్



**మేడారం (అమ్మవారిపేట), 30 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

సమ్మక్కసారలమ్మ అమ్మవార్ల మహాజాతరలో భక్తుల రద్దీ, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ ఓ హృదయాన్ని కదిలించే మానవీయ సంఘటన చోటు చేసుకుంది. పోలీస్ అంటే కేవలం చట్టాన్ని అమలు చేసే అధికారి మాత్రమే కాదని, అవసరమైన వేళ తల్లి, అన్న, సోదరుడిలా ఆదుకునే మనసున్న వ్యక్తి కూడా కావచ్చని ఈ సంఘటన మరోసారి నిరూపించింది. సుమారు 80 సంవత్సరాల వయస్సు గల ఓ వృద్ధురాలు తన కుమారుడితో కలిసి అమ్మవార్ల దర్శనం చేసుకుని ఆనందభరితంగా బయటకు వచ్చింది. దర్శనం అనంతరం ఇంటికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనం ఎక్కేందుకు ప్రయత్నించగా, వయోబారం మరియు శారీరక బలహీనత కారణంగా ఆమె బైక్‌పై కూర్చోలేక తీవ్ర ఇబ్బందులు పడింది. ఆమె పడుతున్న కష్టాన్ని చూసి ఆమె కుమారుడు కూడా అసహాయంగా నిలబడ్డాడు. ఈ దృశ్యాన్ని గమనించిన అక్కడే విధుల్లో ఉన్న మడికొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ వెంటనే ఆమె వద్దకు వెళ్లి ఆత్మీయంగా మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. ఆమెను తన తల్లిలా భావించిన ఆయన ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఎంతో జాగ్రత్తగా ఆమెను చేతుల్లోకి ఎత్తుకుని ద్విచక్ర వాహనంపై సురక్షితంగా కూర్చోబెట్టారు. ఆమెకు ఏ మాత్రం ఇబ్బంది కలగకుండా ఎంతో శ్రద్ధతో ఏర్పాట్లు చేశారు. ఇన్స్పెక్టర్ కిషన్ చూపిన ఈ మానవీయ సహాయంతో వృద్ధురాలి ముఖంలో చిరునవ్వు విరిసింది. ఆనందంతో నిండిన ఆమె, “అమ్మవారు నీకు మంచి చేయాలి నాయనా” అంటూ ఇన్స్పెక్టర్ ని హృదయపూర్వకంగా ఆశీర్వదించింది. ఆ దృశ్యం అక్కడున్న భక్తుల కళ్లను తడిపించింది. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన భక్తులు, పోలీస్ అంటే కేవలం కఠినమైన చట్ట అమలు చేసే అధికారి మాత్రమే కాదని, అవసరమైన వేళ మానవత్వంతో స్పందించే సేవా హృదయం కలిగిన వ్యక్తి అని ప్రశంసల వర్షం కురిపించారు. ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ గారికి అక్కడున్న భక్తులంతా హర్షాతిరేకాలతో అభినందనలు తెలిపారు. అమ్మవారి జాతరలో భద్రతా విధులతో పాటు భక్తుల సంక్షేమం కోసం పోలీసులు చూపుతున్న ఈ సేవాభావం నిజంగా ప్రశంసనీయమని, సమాజానికి ఆదర్శంగా నిలిచే సంఘటనగా ఇది నిలిచిందని భక్తులు అభిప్రాయపడ్డారు. అమ్మవారి ఆశీస్సులతో మానవత్వంతో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటున్నారని ఈ ఘటన మరోసారి రుజువు చేసింది

# లెప్రసీపై అవగాహనతోనే వివక్షతకు ముగింపు





### హనుమకొండలో ఘనంగా “స్పర్శ్” లెప్రసీ అవగాహన కార్యక్రమం

**హన్మకొండ, 30 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

లెప్రసీ (కుష్టు వ్యాధి) గురించి సమాజంలో సరైన అవగాహన కలిగించి, ఈ వ్యాధితో బాధపడుతున్నవారిపై ఉన్న వివక్షతను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని హనుమకొండ జిల్లా ఇంచార్జ్ డీఎంహెచ్ఓ అండ్ జిల్లా కుష్టు నిర్మూలనాధికారి డా. టి. మదన్మోహన్ రావు స్పష్టం చేశారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినం (జనవరి 30) సందర్భంగా నగరంలోని పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రంలో డా. దీప్తి అధ్యక్షతన నిర్వహించిన “స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమం”లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డా. మదన్మోహన్ రావు మాట్లాడుతూ, సమాజంలో ఇంకా లెప్రసీపై అపోహలు, భయాలు ఉండటం వల్ల రోగులు వైద్య సేవలకు దూరమవుతున్నారని అన్నారు. అయితే లెప్రసీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రభుత్వం ఉచితంగా నాణ్యమైన మందులు అందిస్తోందని చెప్పారు. ప్రజలు భయపడకుండా, రోగుల పట్ల మానవీయ దృక్పథంతో ప్రేమాభిమానాలు చూపుతూ ఆదరించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు “లెప్రసీ ఫోర్ట్‌నైట్” కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కాలంలో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, మురికివాడలలో లెప్రసీపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ, లెప్రసీ, టీబీ, హెచ్ఐవి వంటి వ్యాధుల విషయంలో వివక్షత భయంతో కొందరు తొలిదశలో పరీక్షలు చేయించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వ్యాధి తీవ్రతను పెంచుతుందని, ప్రభుత్వం అందిస్తున్న ఖరీదైన ఉచిత మందుల ద్వారా పూర్తిగా నయం కావచ్చని ప్రజలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి సందెల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇంటింటికీ లెప్రసీపై అవగాహన కల్పించాలని, సమాజంలో జరిగే వివిధ సమావేశాల్లో ఈ అంశాన్ని చర్చలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీటీసీఓ డా. హిమబిందు, పిఓ ఎంసిహెచ్ డా. రుబీనా, పిఓ డీటీటి డా. ప్రభుదాస్ లు లెప్రసీ వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, ఎస్ఓ ప్రసన్నకుమార్, డీపీఎంఓ రవీందర్, సిహెచ్ఓ మాధవరెడ్డి, సిఓ సరిత, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, కాకతీయ యూనివర్సిటీ నుండి ఎం ఎస్ డబ్ల్యూ, సైకాలజీ విద్యార్థులు, అలాగే స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. లెప్రసీపై సరైన అవగాహన, సమాజంలో మారుతున్న దృక్పథమే కుష్టు వ్యాధి నిర్మూలనకు మార్గమని వక్తలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.